క్లుప్తంగా

ఆరిమాను గంగమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిఎదుట వేసిన బొమ్మకు పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పాలసముద్రం : మండలంలోని క్రిష్ణజమ్మాపురం పంచాయతీ పావులూరుకండ్రిగలో వెలసిన ఆరిమాను గంగమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉభయదారులు పి.చెంచునాయుడు, పి.సుశీలమ్మ, పి.రాజేష్, చరిత అమ్మవారికి దుస్తులు, పుష్పాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం అమ్మవారి బొమ్మవేసి గుమ్మడి కాయ కొట్టి కర్పూర హారతులిచ్చారు. సాయంత్రం పిండి దీపాలు వెలిగించారు. కళాకారులు కోలాటాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం చేశారు.

మాతమ్మకు ప్రత్యేక పూజలు



ఊరేగుతున్న మాతమ్మతల్లి

పాలసముద్రం : మండలంలోని శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడలో బుధవారం గంగజాతరలో భాగంగా మాతమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించి పుష్పపల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. ప్రతి ఇంటా కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు. నడివీధిలో ఉంచిన గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు.

మీ మేలు మరువలేం



భోజనం చేస్తున్న గర్భిణులు

నగరి : ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్ట్ ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేసింది. గర్భిణులతోపాటు వారి సహాయకులు, పిల్లలకు కూడా వెజిటబుల్ రైస్, గుడ్డు, పుదీనా చట్నీ, చిక్కీ, అరటిపండు, రైతాతో కూడిన పౌష్టికాహారాన్ని మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణనాయక్, ఆర్ఎంఓ గోపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ పంపిణీ చేశారు. గర్భిణులు మీ మేలు మరువలేమంటూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక శ్రద్ధ వహించండి



గర్భవతులతో మాట్లాడుతున్న డాక్టర్ సోమశేఖర్

విజయపురం (నగరి) : గర్భవతులు సురక్షితం ప్రసవం కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ సోమశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు వైద్యపరీక్షలు చేసి మాట్లాడారు. గర్భంతో ఉన్నప్పుడు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రతి గర్భిణి సమతుల్య ఆహారంతో పాటు పోషకాలతో కూడిన తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, కాల్షియం అధికంగా ఉండే ఆహారాలు, కొవ్వు తక్కువగా ఉన్న ఆహారాలు తీసుకోవాలన్నారు. జంక్, కొవ్వు, నూనె, ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోరాదన్నారు. ప్రతి నెల క్రమ తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకుని వైద్యుల సలహాలు–సూచనలు పాటించాలన్నారు. ప్రతి రోజూ తేలికపాటి వ్యాయామం చేయాలని సూచించారు.

గ్రంథాలయంలో వేసవి సందడి



డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

పుత్తూరు రూరల్: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా బుధవారం పలువురు విద్యార్థులకు డ్రాయింగ్, ధ్యానంపై శిక్షణ ఇచ్చినట్లు లైబ్రేరియన్ మీనా కుమారి తెలిపారు. ప్రత్యేకంగా ఒక క్వాలిఫైడ్ టీచర్‌ను నియమించుకుని విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.సమ్మర్ క్యాంపు జూన్ 11 వరకు నిర్వహిస్తామని, పిల్లలను గ్రంథాలయానికి పంపి, వారి అభిరుచుల శిక్షణ పొందేలా చూడాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. 5నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో టీచర్ సుధ పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

- ప్రతి ఇంటికీ సంక్షేమం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధర నెల్లూరు(కార్వేటినగరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందిస్తూ పేదల పక్షపాతిగా నిలిచారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి తెలిపారు. ఆయన బుధవారం గంగాధర నెల్లూరు మండలం వీరకనెల్లూరు సచివాలయం పరిధిలోని కొండేపల్లి దళితవాడ, పోలినాయుడుపల్లి, కొండేపల్లి, పద్మాపురం, మరకనత్తం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారు పొందిన ప్రభుత్వ పథకాలు, లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ, పేద వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్‌క్లినిక్‌లతో పాలనను ఇంటి వద్దకే తీసుకువచ్చారని చెప్పారు. ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.6 లక్షల వరకు లబ్ధి చేకూరుతోందని, దీంతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని వివరించారు. కొండేపల్లి దళివాడకు చెందిన పలువురు మహిళలు మాట్లాడుతూ తమ అనుభవంలో ఉన్న డీకేటీ భూములకు పట్టాలు ఇప్పించాలని కోరారు. స్పందించిన మంత్రి భూములను పరిశీలించి అర్హులైన వారికి పట్టాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచ్ గోవిందస్వామి, ఎంపీటీసీ ఇందిరమ్మ, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నాయకులు పట్టాభిరెడ్డి, వెంకటరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, మునిరాజరెడ్డి, లోకేష్, ఎంపీడీవో శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్, ఏపీఎం చిరంజీవి, పశు సంవర్ధశాఖ జేడీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర



జాతర వేడుకల్లో మంత్రి ఆర్కే రోజా

నగరి : మండలంలోని అడవికొత్తూరులో బుధవారం గంగజాతర వైభవంగా నిర్వహించారు. వేకువజామున గంగమ్మను ఊరేగింపుగా తెచ్చి వేపాకు గుడిసెకు చేర్చారు. ప్రదర్శించిన వీధి నాటకాలు, నృత్యాలు స్థానికులను అలరించాయి. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వేపాకు సారెలు, వెయ్యికన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. తడిబట్టలతో అంగప్రదక్షిణ చేశారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు గంగమ్మ నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం గంగమ్మను మంత్రి ఆర్కేరోజా దర్శించుకున్నారు. ఆమెకు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, పార్టీ నాయకులు పాల్గొన్నారు. రాత్రి బలి అన్నం సమర్పించి గంగమ్మను డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేర దాటించారు.

విజయపురంలో..

విజయపురం (నగరి): విజయపురం మండల కేంద్రంలో బుధవారం గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. గంగమ్మను పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఇంటింటా హారతులు పట్టి, టెంకాయలు కొట్టి, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. గుడి ఎదుట అమ్మవారికి అంబలి పోశారు.

గడప వద్దకే వైద్య సేవలు



శ్రీరంగరాజపురం : ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా గడప వద్దకే వైద్య సేవలు అందజేస్తున్నట్లు డాక్టర్ పల్లవి తెలిపారు. మండలంలోని పద్మాపురం సచివాలయంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్యశ్రీ కింద వైద్యం పొంది విశ్రాంతి తీసుకుంటున్న వారిని పరిశీలించి సలహాలు ఇచ్చారు. అత్యవసర కేసుల సిఫార్సు, ఆరోగ్యశ్రీ వైద్య సేవలపై అవగాహన కల్పించారు. 56 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైద్య చికిత్స చేశారు. మెడికల్ అధికారి సందీప్ రాజు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలసముద్రం : మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని ఏవో ఢిల్లీప్రసాద్ తెలిపారు. పాలసముద్రం రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు సీఆర్పీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంలో చెరకు పంట సాగు, చీడపీడల నివారణ, అధిక దిగుబడి కోసం జీవామృతం వాడకం, కలుపు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో చెరుకు సాగుచేసి బెల్లం తయారు చేస్తే తిరుమల–తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తామన్నారు.

డీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా



ఆందోళన చేస్తున్న కార్మికులు

పుత్తూరు రూరల్: పుత్తూరు చిదా స్పిన్నింగ్ మిల్లును అర్థాంతరంగా మూసివేయడాన్ని నిరసిస్తూ బుధవారం కార్మికులు తిరుపతిలోని డీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్మిక నాయకుడు ఏలుమలైరెడ్డి మాట్లాడుతూ, 2022 ఫిబ్రవరిలో లేబర్ డిపార్ట్‌మెంట్ సమక్షంలో కార్మిక సంఘ నాయకులు, యాజమాన్యం మధ్య కుదిరిన వేతన ఒప్పందం ప్రకారం నాలుగేళ్ల పాటు మిల్లును యథావిధిగా నడపాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల మధ్య చిచ్చుపెట్టి తమ పబ్బం గడుపుకోవాలని యాజమాన్యం చూస్తోందని ఆరోపించారు. అంతేకాకుండా గురువారం (నేడు) కొంత మంది కార్మికులకు నిబంధనలకు విరుద్ధంగా చెక్కులు, నగదు పంపిణీకి సిద్ధపడినట్లు ఆరోపించారు. దీనిని డీసీఎల్ అడ్డుకోవాలని కోరారు. 8.5.2023న తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో చిదా స్పిన్నింగ్ మిల్లుపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏసీఎల్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు.వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు రాజేంద్ర, కాటయ్య, సిఐటీయూ యూనియన్ నాయకులు బాబు, రవిచంద్ర, రామ్మూర్తి, రత్నం, గోవిందరాజులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్ఎం మృతి



చెంగల్రాజు (ఫైల్)

పుత్తూరు రూరల్: పుత్తూరు మున్సిపాలిటీ రాచపాళెంకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ చెంగల్రాజు(93) బుధవారం సాయంత్రం కన్నుమూశారు. ఈయన పుత్తూరు, రాచపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు. తొలుత లెక్కల మాస్టారుగా పనిచేసిన ఈయన 1989లో హెచ్ఎంగా ఉద్యోగ విరమణ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డికి క్లాస్‌మేట్‌గా సుపరిచితులు. ఆయన మృతికి పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం రాచపాళెంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వేసవి శిబిరంతో నైపుణ్యాలు మెరుగు

- శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి



జూడో శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి

వడమాలపేట : క్రీడాకారులు వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు మెరుగు పరచుకోవాలని శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బాలుర హైస్కూలులో జూడో వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, వేసవి సెలవులను వృధా చేసుకోకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. క్రీడల శాఖా మంత్రి ఆర్కే రోజా ప్రతి ఏటా మండల, నియోజక వర్గ స్థాయిలో పలు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారని, అలాగే రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా క్రీడాకారులకు ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు. అనంతరం ఇటీవల తిరుపతిలో జరిగిన జూడో శాప్ లీగ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హేమాద్రి, జూడో జిల్లా కోచ్ గోపి, వ్యాయామోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- వివిధ వాహనాల్లో ఊరేగనున్న స్వామి వారు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబు అవుతున్న ఆలయం



వంద అడుగుల ఏకశిలా ధ్వజస్తంభం

కార్వేటినగరం: కార్వేటినగరంలో ప్రసిద్ధి చెందిన వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 13 నుంచి 21 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఇందులో స్వామి వారు రోజుకో అవతారంలో వివిధ వాహనాలపై విహరిస్తారని తెలిపారు. మే 12వ తేదీ సాయంత్రం అంకురార్పణ, 13వ తేదీ ఉదయం 10 నుంచి 10.30 మధ్య కర్కాటక లగ్నమందు ధ్వజారోహణం, రాత్రికి పెద్ద శేష వాహనం, 14న చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం ఉంటాయని తెలిపారు. 15న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనం, 16న కల్పవృక్ష వాహనం, ఆర్జిత కల్యాణోత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం, 17న ఉదయం మోహినీ అవతారం, రాత్రికి గరుడ సేవ, 18వ తేదీ ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం గజ వాహనం,19న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహనాలు, 20న రథోత్సవం, రాత్రి అశ్వ వాహనం, 21న ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం ఉంటాయని పేర్కొన్నారు.

14 ఎకరాల అతిపెద్ద స్కంధ పుష్కరిణి

19వ శతాబ్దంలో కరువు నుంచి ప్రజలను కాపాడేందుకు అప్పటి కార్వేటినగరం సంస్థానాధీశుడైన వెంకటపెరుమాళ్ రాజు 14 ఎకరాల విస్తీర్ణంలో స్కంధ పుష్కరిణిని నిర్మించారు. దక్షిణాసియాలోనే ఎక్కడా ఇలాంటి పుష్కరిణి లేదని ప్రతీతి. పుష్కరిణి మెట్లపై నాటి శిల్పకళను చూడవచ్చు. నీటి మట్టం ఏ వైపు చూసినా సమాంతరంగా ఉండడం నాటి శిల్పుల గొప్పతనానికి నిదర్శనం. ఏటా శ్రీవేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చక్రస్నానాన్ని, తెప్పోత్సవాలను పుష్కరిణిలో వైభవంగా నిర్వహిస్తారు. అలాగే పుష్కరిణి సమీపంలో వెలసిన శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయ తెప్పోత్సవాలు ఇందులోనే నిర్వహిస్తారు. పుష్కరిణిలో నీరాలి మండపం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆలయ ప్రత్యేకత తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవతామూర్తులను ఇక్కడికి తెప్పించి ప్రతిష్టించినట్లు పురాణ కథనం. సంతాన ప్రదాతగా శ్రీవేణుగోపాలస్వామి విరాజిల్లుతున్నారు. ఆకాశరాజు తర్వాతి వంశానికి సంతానం కలగక పోవడంతో నారాయణరాజు వెంకటాచలమున తపస్సు చేసి శ్రీనివాసుని అనుగ్రహం పొందినట్లు కథనం ప్రచారంలో ఉంది. ఆయన వంశానికి చెందిన వెంకటపెరుమాళ్‌రాజు 1610–1719 మధ్య కాలంలో ఆలయాన్ని నిర్మించినట్లు ప్రతీతి. సంస్థానాధీశుల పాలన అనంతరం 1936 నుంచి ఈ ఆలయం నిర్వాహణ దేవదాయశాఖ పరిధిలోకి వచ్చింది. 1989 ఏప్రిల్ పదో తేదీ నుంచి తిరుమల–తిరుపతి దేవస్థానం పరిధిలోకి వచ్చింది. ఆలయంలో మకరతోరణం, గోమాతతో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడి విగ్రహాలను ఏకశిలతో రూపొందించడం విశేషం. ఆలయ ఆవరణలో ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ఉన్న సుమారు వంద అడుగులకు పైగా ఏకశిల ధ్వజస్తంభం భక్తులను ఆకట్టుకుంటోంది. పుత్తూరు నుంచి 12 కిలో మీటర్ల దూరంలో కార్వేటినగరం ఉంది.

ప్రజా సంక్షేమానికి నిరంతర కృషి



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్ ఇస్తున్న మంత్రి ఆర్కేరోజా

- మంత్రి ఆర్కేరోజా

నగరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మున్సిపల్ పరిధి 17వ వార్డు సచివాలయం పరిధిలోని కరకంతాపురం దళితవాడ, బీసీ కాలనీలో బుధవారం ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలస్థాయి అధికారులు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి గ్రామంలో ప్రతి ఇంటినీ సందర్శించారు. ప్రతి ఒక్కరినీ పలకరించారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు పథకాలు వర్తించాయా, లేదా? అని లబ్ధిదారులను ఆరాతీశారు. సంక్షేమ పథకాల అమలు తీరు.. లోటుపాట్లతో పాటు సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకూ వస్తున్నట్లు ఆమె చెప్పారు. పథకాల లబ్ధి పరంగా ఉన్న సమస్యలను, నీటి పారుదల కాలువల సమస్యలను స్థానికులు మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన మంత్రి సంబంధిత విభాగాల అధికారులకు, సచివాలయ ఉద్యోగులకు ప్రాధ్యానత్య క్రమంలో వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2024 ఎన్నికల్లో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, మండల సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్ చిన్నపాప, నాయకులు మురుగ, ఎల్లప్పరెడ్డి, గోవిందరెడ్డి, తనికాచలం తదితరులు పాల్గొన్నారు.

థాంక్యూ మేడమ్!

- మంత్రి రోజా చొరవతో బీసీ సర్టిఫికెట్ల జారీకి ప్రభుత్వం జీఓ
- అగ్ని కుల క్షత్రియుల కల సాకారం
- మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కుల నేతలు



సురేష్‌రాజు సన్మానిస్తున్న మంత్రి రోజా

వడమాలపేట : తమను బీసీ జాబితాలో చేర్చి, సర్టిఫికెట్లు ఇవ్వాలని నగరి నియోజక వర్గంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అగ్నికుల క్షత్రియులు(రాజులు) కల సాకారమైంది. మంత్రి ఆర్కేరోజా చేసిన కృషికి ప్రభుత్వం వారిని బీసీలుగా పరిగణిస్తూ జీఓ జారీ చేయడంతో బుధవారం వడమాలపేట మండల క్షత్రియులు, నాయకులు, ప్రజలు మంత్రిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ గతంలో జగనన్న పాదయాత్రలో నియోజక వర్గంలోని అగ్ని కుల క్షత్రియ నాయకులు తమకు బీసీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారని, ఇదే విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, బీసీ సర్టిఫికెట్లు జారీకి జీఓ తీసుకొచ్చినట్లు చెప్పారు. గతంలో నియోజక వర్గంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా పనిచేసిన నాయకులు చేయని పనిని.. తన హయాంలో కార్యరూపం దాల్చేలా చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలోనే పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఎక్కువగా ఇచ్చామన్నారు. అనంతరం ఇటీవల సచివాలయ కన్వీనర్‌గా నియమించిన సురేషరాజును మంత్రి రోజా, నాయకులు సన్మానించారు. రాంప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఉపేంద్ర, నాయకులు తులసీరామరాజు, వెంకట్రామరాజు, రమేష్‌రాజు, సుబ్రమణ్యంరాజు, అరుణ్, రమణరాజు, రవిరాజు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకారకోడి ఉత్సవం



ఉత్సవమూర్తులను తీసుకెళ్తున్న కమిటీ సభ్యులు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో బుధవారం సాయంత్రం శ్రీకార కొడి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మహాభారత ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయమే అమ్మవారికి అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రధానాచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను అలంకరించి ఊరేగించారు. మహిళలు కర్పూర నీరాజనాలు పలికి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ విగ్రహాలను ఆనవాయితీగా 32 గ్రామాలకు తీసుకెళ్లి తిరిగి ఆలయానికి తీసుకువస్తారు. తర్వాత అంకురార్పణ చేసి ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. స్థానిక బండి సోమసుందర్‌రెడ్డి, ప్రేమలత కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త బండి ఉమాపతిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను మహాభారతానికి సంబంధించి గ్రామాలకు తీసుకెళ్లారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

శ్రీరంగరాజపురం : ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిన్న రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. వీటిని బుధవారం తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రత్యేక చొరవతో రోడ్డు పనులు చేపట్టామన్నారు. చెరువు కట్టలను మట్టితో పటిష్ట పరుస్తున్నామని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే పరిహారం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గిడ్డ మహారాజపురం సర్పంచ్ చిరంజీవి, ఆర్ఐ త్యాగరాజు, వీఆర్వో జయశంకర్, పంచాయతీ కార్యదర్శి నందకుమార్, సునీల్‌కుమార్, నాయకులు రామచంద్రయాదవ్, వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈవో విజయకుమార్

కార్వేటినగరం: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఎం.విజయకుమార్ తెలిపారు. ఆయన బుధవారం కార్వేటినగరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యనభ్యసించిన వారు ఎందరో ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, రకాలైన గ్రంథాలు, పుస్తకాలు, అందుబాటులో ఉంటాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు మాట్లాడుతూ కార్వేటినగరం గ్రంథాలయంలో ఎక్కడా లేని విధంగా మహత్తరమైన, పురాణాలు, రాచరిక, చారిత్రక గ్రంథాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

పాలసముద్రం : మండలంలోని మహదేవపురం క్రాస్ వద్ద బుధవారం ప్రైవేట్ బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. తమిళనాడు రాష్ట్రం బాలక్రిష్టాపురం గ్రామానికి చెందిన వారు బుధవారం చిత్తూరు సమీపంలోని గంగాసాగరంలో పెళ్లికి వచ్చారు. పెళ్లి ముగించుకుని గంగా సాగరం వెళుతుండగా మహదేవపురం క్రాస్ వద్ద బస్సు అదుపుతప్పింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును లోయలోకి కాకుండా పక్కకు తప్పి చెట్టును ఢీకొనేలా చేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. 15 అడుగుల లోయలోకి బస్సు బోల్తా పడి ఉంటే ప్రమాదం తీవ్ర స్థాయిలో ఉండేదని ప్రయాణికులు తెలిపారు. గాయపడిన వారిని బంధువులు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ షేక్షావలి బస్సును పోలీసు స్టేషన్‌కి తరలించారు. రికార్డులు పరిశీలించి జరిమానా విధించారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



విజయపురం (నగరి): ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగివైర్లను చోరీ చేసిన సంఘటన మండలంలోని చెంగమనాయుడు కండ్రిగలో పొలాల్లో బుధవారం వెలుగులోకి వచ్చింది. నెలలో రెండు సార్లు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైందని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్మశాన వాటికకు హద్దులు ఏర్పాటు చేయాలని..

నగరి : నగరి మున్సిపాలిటీకి సంబంధించిన శ్మశాన వాటికకు హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు బుధవారం శ్మశాన వాటిక వద్ద నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ శ్మశాన వాటికకు హద్దులు గుర్తించకపోవడంతో స్థలం ఆక్రమణల పాలవుతోందని, దీనికి అడ్డుకట్ట వేసేదిశగా హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పట్టణ కార్యదర్శి వేలన్, బాషా, దాము రెడ్డి, శేఖర్, మురళి, అయ్యప్ప పాల్గొన్నారు.